క్లుప్తంగా

సీఎంకు బాబా ఆశీస్సులు ఉండాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హజరత్ హుస్సేన్ షా ఖాద్రీ దర్గా బాబా ఆశీస్సులుండాలని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు. దర్గాలో బుధవారం బాబా వారికి గౌస్‌మొహిద్దీన్ చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మరిన్ని అద్భుతమైన సంస్కరణలు రావాలని, చక్కని పరిపాలన రావాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మత పెద్దలు షేక్ నజీర్, షేక్ షబ్బీర్, షేక్ గౌసి, షేక్ షఫీ, ఎండీ జబీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన అవంతి బృందానికి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై భావన, తన్మయి, రిషిత, రిజుత, లాస్య, జిష్ణు, ప్రణతి, భార్గవి, మేఘన, ధాత్రి, ధన్విలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యను వేధిస్తున్న భర్తపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన కుంభ గాయత్రి వంట పనులు చేస్తుంది. భర్త ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవించి భార్యను అనుమానించడం, వేధించడం చేస్తున్నాడు. ఆర్నెల్లుగా వేధిస్తుండడంతో గతంలో ఆమె పోలీసులను ఆశ్రయించింది. కౌన్సెలింగ్‌కు పంపగా సక్రమంగా కాపురం చేసుకుంటామని అంగీకరించాడు. రెండు నెలలుగా మరలా వేధింపులు ప్రారంభించాడు. దీంతో ఆమె భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఫోన్‌లో వేధిస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సెమ్మెస్, వాట్సాప్ మెసేజ్‌లు చేసి మహిళను వేధిస్తున్న వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమ్మరిపాలేనికి చెందిన సీహెచ్ లక్ష్మి భర్త నుంచి విడిపోయి ఒంటరిగా జీవిస్తోంది. గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి 15 రోజులుగా వేధిస్తున్నాడు. దీనిపై బాధితురాలు భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంప్రదాయ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



విజయవాడ కల్చరల్: సంప్రదాయ పరిరక్షణలో బాల బాలికలు భాగస్వాములు కావాలని శివజ్ఞానపీఠం పీఠాధిపతి శివచార్యస్వామి అన్నారు. శత సహస్ర దీపార్చన సేవా మండలి ఆధ్వర్యంలో శోభకృత్ ఉగాది వేడుకల సందర్భంగా చిన్నారులకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామిజీ మాట్లాడుతూ.. బాల్యంలో సంప్రదాయాలు నేర్పించాలన్నారు. సేవా మండలి నిర్వాహకుడు నాగలింగం శివాజీ మాట్లాడుతూ సంస్థ ద్వారా ప్రతీ ఏటా కోటి దీపార్చనతో పాటు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

ధన ధాన్యలక్ష్మి అలంకారంలో కాళీమాత

కృష్ణలంక(విజయవాడతూర్పు): శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు ధన ధాన్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో శిష్టానారాయణ శాస్త్రిచే పంచాంగ శ్రవణం జరిపించారు. పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు వసంత నవరాత్రుల సందర్భంగా నిత్య అభిషేకం, పుష్పార్చన నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైభవంగా శోభకృత్ ఉగాది వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. అనంతరం షడ్రుచులతో చేసిన ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు.

గాజుల అలంకారంలో..

కొత్త సంవత్సరాదిన ప్రజలు తమ ఇష్ట దైవాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో దేవతా మూర్తులకు విశేష అలంకరణ, పూజలు నిర్వహించగా, భక్తులు స్వామి అమ్మ వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. చిట్టినగర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారికి గాజులతో విశేషంగా అలంకరించారు. తెల్లవారుజామున అమ్మవారికి గాజుల అలంకరణ, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరాగా వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల పుష్పాలతో విశేషంగా అలంకరించారు.

108 కిలోల పులిహోరతో..

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి



విశేష అలంకారంలో స్వామి వారు



పాతశివాలయంలో పంచాంగ శ్రవణం

విశేష అలంకారంతో పాటు 108 కిలోల పులిహోరతో తయారు చేసిన ప్రతిమ విశేషంగా ఆకట్టుకుంది. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఉగాది పచ్చడి, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన కమిటీ ఏర్పాట్లు చేసింది. సొరంగం రోడ్డులోని నూకాలమ్మ వారి గుడిలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. సాయిరాం థియేటర్ సమీపంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు రజత కవచాన్ని ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 9 గంటలకు లలితా సహస్ర నామ పారాయణ జరిగింది. సాయంత్రం పంచాంగ శ్రవణం, సామూహిక మహాలక్ష్మీదేవి పూజ జరిగింది.

పాతబస్తీలో వేడుకలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పాతబస్తీలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. వన్‌టౌన్‌లోని శ్రీరామకన్యకాపరమేశ్వరి నగరేశ్వరస్వామి వార్ల దేవస్థానం (కొత్త గుళ్ల)లో ఉదయం నుంచి రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. అలాగే కొత్తపేట రామాలయంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

పాతశివాలయంలో..

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో కొలువై ఉన్న శ్రీ మల్లేశ్వర స్వామి వారికి విశేష పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ అభిషేకాలను కొనసాగించారు. భ్రమరాంబ అమ్మవారికి స్నపనాభిషేకాన్ని నిర్వహించి విశేష అర్చనలను చేపట్టారు. అనంతరం ఆలయంలో ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేసి ప్రత్యేక వైదిక కార్యక్రమాలను జరిపారు. అనంతరం పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షించారు.

శ్రీ వారి సన్నిధిలో..

బ్రాహ్మణవీధిలోని పురాతన ఆలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ వేద పండితులు అవాధాని వారు పంచాంగ శ్రవణం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరిగోపీనాథ్‌బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



గాజుల అలంకరణలో మహాలక్ష్మి అమ్మ వారు



శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు



పులిహోరతో రూపొందించిన స్వామి వారి రూపం

దుర్గగుడి అర్చకులకు ఉగాది పురస్కారాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి చెందిన పలువురు అర్చకులకు దేవస్థానం బుధవారం ఉగాది పురస్కారాలను అందజేసింది. దేవస్థానానికి చెందిన వేద పండితులు వి.శావస్వ మహర్షి, ఉప ప్రధాన అర్చకులు ఎం.వెంకట రామమూర్తి, బి.శంకర శాండిల్య, ముఖ్య అర్చకులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి, అర్చకులు పవన్‌కుమార్‌లకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబలు పురస్కారాలను అందజేసి సత్కరించారు.

వన్‌టౌన్ పీఎస్‌లో సీపీ ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న సీపీ టీకే రాణా, అధికారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో గంగా శ్రీ దుర్గా సమేత మల్లేశ్వరస్వామి వార్లకు పోలీస్ కమిషనర్ టీకే రాణా బుధవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో వెండి రథోత్సవం జరిగింది. అందులో భాగంగా రథోత్సవం పాతబస్తీ వీధుల మీదుగా బుధవారం రాత్రి వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకుంది. అక్కడ సీపీ ఇతర అధికారులు రథానికి స్వాగతం పలికారు. సీపీ టీకే రాణా, ఏసీపీ హనుమంత రావు, సీఐ సురేష్‌రెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు. నగరంలోని అన్ని పోలీసుస్టేషన్ల అధికారులతో పాటుగా ఉన్నతాధికారులందరూ వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకొని అమ్మవారి రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సూర్యారాధన శ్రేయోదాయకం

విజయవాడ కల్చరల్: సూర్యారాధన శ్రేయోదాయకమని, నిత్య పూజలతో తరించాలని దెందుకూరు సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నారు. శృంగేరీ పీఠాధిపతులు భారతీతీర్థ మహాస్వామి జన్మదిన వేడుకల సందర్భంగా దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సూర్యారాధన కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. సుబ్రహ్మణ్య శాస్త్రి సూర్యారాధన విశిష్టతను వివరించారు. భారతీయ ధర్మంలో సూర్యుడికి ప్రత్యేక స్థానముందన్నారు. వేదాలలోనూ సూర్యుని ప్రస్తావన కనిపిస్తుందని చెప్పారు. దేవాలయ ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ లోక శాంతి కోసం జగద్గురువులు భారతీతీర్థ మహాస్వామి ఆదేశాలతో సూర్యారాధన నిర్వహిస్తున్నామన్నారు. సూర్యారాధన, సూర్య నమస్కారాల వల్ల సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు.



ఇంద్రకీలాద్రిపై శోభకృత్ సందడి

ఇంద్రకీలాద్రిపై శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ సందడి నెలకొంది. తెలుగు వారి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి బుధవారం తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ ఆలయ పాలక వర్గం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









దుర్గమ్మ సన్నిధిలో మజ్జిగ పంపిణీ ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఈఓ భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వేసవిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఆలయ ప్రాంగణంలో బుధవారం నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభమైంది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన మజ్జిగ పంపిణీని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ప్రారంభించారు. భక్తులు అందజేసిన విరాళాలతో మజ్జిగ పంపిణీ చేపడుతున్నట్లు ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. వేసవి కాలం పాటు మజ్జిగ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు మజ్జిగ పంపిణీ కేంద్రం వద్ద ప్రదర్శిస్తామన్నారు. తొలి రోజున ఈఓ భ్రమరాంబ, కె.అమరేంద్ర, నూనె భవానీశంకర్, నాళం వెంకటేశ్వర్లు, నాళం శ్రీమన్నారాయణమూర్తి, వడ్డాది పాండురంగారావు, పర్భికలు విరాళాలను అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పండుగలు, పర్వదినాలు అన్ని వర్గాలు జరుపుకోవాలనే భావనతో ప్రతి ఏటా పేదలు, పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. నగరాల వెల్ఫేర్ సొసైటీ, ఏపీ నగరాలు అసోసియేషన్, యాంటీకో స్క్వాడ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పేదలకు చీరల పంపిణీ జరిగింది. చిట్టినగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ భాగ్యలక్ష్మి విచ్చేసి చీరలను అందజేశారు. సేవా సంస్థల ద్వారా గడిచిన 5 ఏళ్లగా పేదలకు చీరల పంపిణీ చేయడం అభినందనీయమని మేయర్ పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలతో పాటు పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను సైతం ఏర్పాటు చేస్తున్నామని సంస్థ డైరెక్టర్లు లింగిపిల్లి రామకృష్ణ పేర్కొన్నారు. రానున్న కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని డైరెక్టర్ నాగోతి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్త అమ్మవారి దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, గుజ్జారి అమర్‌బాబు, కొరగంజి జగన్నాథరావు, రాంపిళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని ఆదర్శ్ రూరల్ హెల్త్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.రామకృష్ణ అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడ హనుమాన్‌పేటలోని నిరాశ్రయుల వసతి గృహంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీడీ రామకృష్ణ మాట్లాడుతూ.. నీటి నిల్వలను పెంచుకుంటూ భావితరాల వారికి సురక్షితమైన నీటిని అందించాలన్నారు. భూమి మీద మానవులు జీవించడానికి నీరు ఎంతో అవసరమని చెప్పారు. జనాభా పెరిగే కొద్ది నీటి వినియోగం ఎక్కువై కొరత ఏర్పడుతోందన్నారు. నేడు 663 మిలియన్లకు పైగా ప్రజలు తమ ఇళ్ళకు సమీపంలో సురక్షితమైన నీటి సరఫరా లేక సంక్షోభంలో జీవిస్తున్నారన్నారు. భూమిపై ప్రాణాలు కాపాడేందుకు నీటిని ఆదా చేయడం మనందరి బాధ్యత అన్నారు. నీటి బ్యాంకులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అంబేడ్కర్ స్మృతివనం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడ తూర్పు): నగరంలోని స్వరాజ్య మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ ప్రత్యేక కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. విగ్రహానికి సంబంధించి డిజైన్లను ఢిల్లీ నుంచి వచ్చిన డిజైనర్లతో పాటు పరిశీలించిన ఆమె ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్మాణ పనులు జరగాలని ఆదేశించారు. కారిడార్ మొత్తంలో గ్రానైట్ ఫుట్‌పాత్, ల్యాండ్ స్కేప్, కాంపౌండ్ వాల్ నిర్మాణాన్ని పరిశీలించిన ఆమె అంబేడ్కర్ విగ్రహ భాగాలు జాగ్రత్తగా నిర్మాణం చేయాలని, అనుకున్న సమయానికి అంబేడ్కర్ స్మృతివనం, ప్రధాన విగ్రహంతో పాటు మిగిలిన పనులు సైతం సమయంలోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచనల మేరకు విగ్రహం కింద భాగంలో రెస్టారెంట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, మిని థియేటర్, ఎగ్జిబిషన్, మ్యూజికల్ ఫౌంటెన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో సీఆర్డీఏ, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రౌండ్ టేబుల్ ఇండియా జాతీయ అధ్యక్షుడు మనీష్ లఖోటియా అన్నారు. రౌండ్‌టేబుల్ ఇండియా 68, లేడీస్ సర్కిల్ 52 సంయుక్త ఆధ్వర్యంలో ఆధునికీకరించిన శ్రీవిద్యా అప్పర్ ప్రైమరీ పాఠశాలను బుధవారం ఆయన పునఃప్రారంభించారు. పాఠశాలకు బెంచ్‌లు, తాగునీటి అవసరాల కోసం ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. క్రీడా పరికరాలను పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా మనీష్ లఖోటియా మాట్లాడుతూ రూ.2 లక్షల వ్యయంతో పాఠశాలకు నూతన హంగులు సమకూర్చామన్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రౌండ్‌టేబుల్ ఇండియా కృషి చేస్తోందని చెప్పారు. పాఠశాలలో 150 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చామన్నారు. కార్యక్రమంలో రౌండ్‌టేబుల్ ఇండియా చైర్మన్ డాక్టర్ శ్రీహర్ష గుత్తికొండ, లేడీస్ సర్కిల్ చైర్ పర్సన్ డాక్టర్ ప్రశాంతి, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

నేడు, రేపు విశేష పూజలు

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో రామమందిరంలో ఈనెల 23, 24 తేదీల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. 23న ఉదయం 8 గంటల నుంచి విఘ్నేశ్వరుని పూజతో పూజలు ప్రారంభిస్తామన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు.

దేశ భవితకు యువత పాటుపడాలి

గుణదల(విజయవాడతూర్పు): దేశ భవిత యువతపై ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి పాటుపడాలని జెస్యూట్ ప్రావిన్స్ ప్రావెన్షియల్ ఫాదర్ కె.స్టానిస్లాస్ తెలిపారు. ఆంధ్రలయోల కళాశాల ఆవరణలో యూత్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరిట ఐకానిక్ భవనం ప్రారంభోత్సవం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. యువతను చైతన్య వంతులుగా తీర్చిదిద్దటంలో విద్యా సంస్థలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రతిభావంతులుగా చేయాలని కోరారు. మరో అతిథిగా హాజరైన విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులను నైతిక విలువలు కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దేందుకు లయోల కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు. దీనిలో భాగంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పేరుతో ఐకానిక్ భవనాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. అనంతరం నూతన భవనాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని నాని, లయోల కళాశాల రెక్టర్ ఫాదర్ బాలశౌరి, కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.